ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం

- ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే సీఎం లక్ష్యం
- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- 53వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



కేస్ షీట్లు అందుకున్న రోగులతో కె.కె.రాజు, కార్పొరేటర్ బర్కత్ అలీ, జెడ్సీ కృష్ణ తదితరులు



శిబిరానికి హాజరైన 53వ వార్డు ప్రజలు

మద్దిపాలెం: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చి అనేక విధాలుగా కృషి చేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. 53వ వార్డు శివనగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేందుకే ఆరోగ్య సురక్ష క్యాంపులను సీఎం రూపొందించారన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అనేక వ్యాధులను చేర్చి, ప్రజలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం అందిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలోకి రాలేని వారు దరఖాస్తు చేసుకుంటే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోందని చెప్పారు. ప్రతి సంక్షేమ పథకం ప్రజల ముంగిటకే అందేలా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సత్ఫలితాలను సాధించామన్నారు.

విశేష స్పందన

వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. సమన్వయకర్త కె.కె.రాజు వార్డు అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నారని, అందులో భాగంగానే యూపీహెచ్‌సీ ఏర్పాటుకు కృషి చేశారన్నారు. జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఏఎన్ఎంలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని అక్కడే టెస్టులు నిర్వహించి, టోకెన్లు అందజేస్తున్నారని చెప్పారు. వైద్య శిబిరాలకు అనేక మంది రావడంతో రద్దీ ఎక్కువగా ఉంటోందని, ఈ నేపథ్యంలో క్యాంపును వచ్చే నెల 18 వరకు పొడిగించారని, అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని జెడ్సీ కోరారు.

వైద్య శిబిరం విశేషాలు

- 53వ వార్డు మద్దిపాలెంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో నాలుగు సచివాలయాలకు కలిపి 1,600 టోకెన్లు అందజేశారు.
- 772 మంది రోగులు చికిత్స కోసం వైద్య శిబిరానికి హాజరయ్యారు.
- 277 మందికి 45 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు.
- ఆరుగురిని కేజీహెచ్‌కు, ఒక్కరిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రిఫర్ చేశారు.

కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, వార్డు నాయకులు సదరం జ్ఞానేష్, షేక్ బాబ్జి, అంబటి శైలేష్, ఎం.సునీల్, హనుమంతు, నబీ, అలీ, జోత్స్న, సుశీల, మంగ, లక్ష్మి, సత్యారావు, పాత్రుడు, వల్లి, జీవీఎంసీ అధికారులు, యూజీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది, అధిక సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.



గైనకాలజీ విభాగంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు, నర్సులు

కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నా..



ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు చేశారు. కంటి సమస్య ఉండటంతో శివనగర్ ఆరోగ్య కేంద్రంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చి చూపించుకున్నాను. కంట్లోకి డ్రాప్స్ ఇచ్చి, మందులు రాశారు. వారం రోజుల తర్వాత మళ్లీ రావాలని సూచించారు.

– ఎం.నాగేశ్వరరావు, పార్వతీనగర్

వైద్య శిబిరాలు ఉపయోగకరం



ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరం. చాలా మంది సద్వినియోగం చేసుకుంటారు. నా సమస్యపై గైనకాలజిస్ట్ వద్ద చూపించుకోవడానికి శిబిరానికి వచ్చాను. డాక్టర్లు పరిశీలించి, స్కాన్ ఒక్కటే బయట చేయించుకోమన్నారు. మిగతా టెస్టులన్నీ ఇక్కడే చేశారు.

– నూకరత్నం, శ్రీరాంనగర్

ఉచితంగా మందులు ఇస్తున్నారు



కాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. మెడికల్ క్యాంపు అవుతుందని వలంటీర్ చెబితే.. మా కుమార్తె ఇంటికి వచ్చి, మందులు తీసుకోవడానికి ఇక్కడికి వచ్చాను. మంచిగా వైద్యం చేసి ఉచితంగా మందులు అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం బాగుంది. ప్రజలకు అన్ని సదుపాయాలు అందిస్తోంది.

– అప్పలరత్నం, హర్షనగర్

క్లుప్తంగా

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు బుధవారం ఈవో కొండబాబు డ్రా తీసి, రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. రైతులు వారికి వచ్చిన స్టాల్‌లో వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ సేవలు ఆదర్శనీయం



వానప్రస్థ వృద్ధాశ్రమ ఉత్సవాల్లో పాల్గొన్న కె.కె.రాజు తదితరులు

మురళీనగర్: వానప్రస్థ వృద్ధాశ్రమం ద్వారా వృద్ధులకు రొబ్బి శ్రీనివాస్ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, కె.కె.రాజు అన్నారు. 49వ వార్డు పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లోని వానప్రస్థ వృద్ధాశ్రయ వసంతోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీనివాస్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వృద్ధులకు సేవ చేస్తూ అనేకమంది వయసు మళ్లి కుటుంబ సభ్యుల తిరస్కారానికి గురైనవారిలో వెలుగులు నింపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, నిర్వాహకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కృష్ణా జలాల గెజిట్‌ను కేంద్రం వెనక్కి తీసుకోవాలి

మద్దిపాలెం: కృష్ణా జలాల పునర్విభజన గెజిట్‌ను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ విభాగం చైర్మన్ మూల వెంకటరావు అన్నారు. పునఃపంపకంపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలకు దారితీసేలా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు అధికారాన్ని కట్టబెడుతూ కేంద్రం విడుదల చేసిన గెజిట్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ఎన్నికల సమయంలో బీజేపీ తమ రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం ఈ గెజిట్ విడుదల చేసినట్టు ఉందన్నారు. ఎన్నికలు ఎక్కడ జరిగితే అక్కడ ఆ ప్రాంత ప్రజలకు ఏదో మేలు చేస్తునట్టు మభ్యపెట్టడం సరికాదని, కర్ణాటక ఎన్నికల సమయంలో కూడా అప్పర్ భద్ర నిర్మాణానికి రూ.5,300 కోట్లు ప్రకటించిందని, దాని వలన భవిష్యత్తులో ఏపీలో కర్నూల్‌కు ఎంతో నష్టం జరుగుతుందన్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రప్రభుత్వంతో మాట్లాడి తక్షణమే ఏపీకి సంబంధించిన నీటి హక్కులు కాపాడాలని ఆయన కోరారు.

ఎకో వైజాగ్‌ను విజయవంతం చేయాలి

డిప్యూటీ మేయర్ శ్రీధర్



విశాఖ విద్య: పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎకో వైజాగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 52వ వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో మిద్దెతోటల పెంపకానికి అవసరమైన సామగ్రి పంపిణీ చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. దీని కోసం మద్రిపాలెం ఉడా లే అవుట్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇంటిపై కప్పుపై సేంద్రియ వ్యవసాయం చేసే వారికి దేశీయ కూరగాయల మొక్కలు, పిచ్చుకలు, పక్షులకు నీళ్ల ఆహారం పెట్టేందుకు గూళ్లు వంటివి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్రిపాలెం పరిసర కాలనీ వాసులు భాగస్వాములు కావాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: మురళీనగర్ 11 కేవీ ఫీడర్‌లో ఏఎల్ 59 జీబ్రా కండక్టర్స్ మార్పిడి పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తెన్నేటినగర్, వర్మా కాంప్లెక్స్, మురళీనగర్, బాలభాను పాఠశాల ప్రాంతం, బర్మా కాలనీ, పట్టాభిరెడ్డితోట, ఎన్‌జీజీవోస్ కాలనీ, అయ్యప్పనగర్, మసీదు ప్రాంతం, సింగరాయిమెట్ట, మంచుకొండ గార్డెన్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ప్రజల ముంగిటకు ఆరోగ్య సేవలు



వైద్య శిబిరం టోకెన్ అందిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: ప్రజల చెంతకు ఆరోగ్య సేవలు అందించడమే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని 49వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు అన్నారు. వార్డులోని 280 సచివాలయం, క్లస్టర్ సీ-18, 19 పరిధి సూర్యనగర్-1లో బుధవారం ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని పరీక్షలు చేయించుకుని పేర్లు నమోదు చేసుకున్న వారికి టోకెన్లు అందించారు. ఏఎన్ఎం డి.త్రివేణి, ఆశా వర్కర్ బి.జయ స్థానికులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, శివాలయం బోర్డు ధర్మకర్త సిహెచ్.శ్యామల, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.శ్రీను, బి.శంకర్, కె.కిషోర్, ఐ.పూర్ణ, ఎస్.వెంకటలక్ష్మి, ఎ.లక్ష్మి, పి.దుర్గ, వలంటీర్ ఐ.జగదీష్ పాల్గొన్నారు.

సేవల్లో మేటి వానప్రస్థ వృద్ధాశ్రమం

శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి



ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న స్వరూపానందేంద్ర స్వామీజీ

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అన్న సూక్తి తూచా తప్పకుండా అమలు చేస్తూ సామాజిక సేవలో మేటిగా వానప్రస్థ వృద్ధాశ్రమం నిలుస్తోందని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి అన్నారు. 49వ వార్డు పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లోని వానప్రస్థ వృద్ధాశ్రమం బుధవారం నిర్వహించిన 12వ వార్షికోత్సవంలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ వృద్ధాశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్ వృద్ధులకు చేస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సనాతన హిందూ ధర్మంలో పూజాధికాలతోపాటు దీనులు, అభాగ్యులను ఆదుకోవడానికి కూడా అత్యంత ప్రాధాన్యముందని పేర్కొన్నారు. పురాణాలు, వేదాల్లో ఈ ప్రస్తావన ఉందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో వృద్ధాశ్రమాల అవసరం ఎంతో ఉందని సూచించారు. నిరాదరణకు గురైన తల్లిదండ్రులను అక్కున చేర్చుకుని సేవలందించడం గొప్ప విషయమని, యువతరం వానప్రస్థ వృద్ధాశ్రమ సేవలను ఆదర్శంగా తీసుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ఆశ్రమం 25 వసంతాలు పూర్తి చేసుకుని సేవలను మరింతగా విస్తరించాలని స్వామి ఆకాంక్షించారు. ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి నిర్వాహకుడు శ్రీనివాస్‌ను అభినందించారు.

కేంద్రీయ విద్యాలయంలో ముగిసిన క్యాంప్



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేర్‌లో సోమవారం ప్రారంభమైన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. ఉదయం సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం ఫ్లాగ్ బ్రేక్, రాత పరీక్ష, లాగ్ బుక్స్ తనిఖీలు నిర్వహించారు. 11 స్కూళ్ల నుంచి పాల్గొన్న సుమారు 200 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్ కలిగి ఉండవలసిన క్రమశిక్షణ, చురుకైన భాగస్వామ్యం ప్రతీ ఒక్కరూ కలిగి ఉన్నారని ప్రశంసించారు. చివరిగా స్కౌట్ అండ్ గైడ్ పతాకం అవనతం చేశారు. క్యాంప్‌లో పాల్గొన్న వారందరికీ ఆయన ప్రశంసాపత్రాలు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు. అలుమ్ని సభ్యులు విజయ్‌భాస్కర్, సూర్య, స్కూల్ హెచ్ఎం శైలజ, సిబ్బంది రేఖ మిట్టపల్లి, విజయలక్ష్మి, ప్రభాకర్, కామేశ్వరరావు, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత

దాబాగార్డెన్స్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న భక్తిసంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ నెల 15న కరకచెట్టు పోలమాంబ ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక సంగీత సేవా సంస్థ మెలోడీ క్రియేటర్స్‌చే నిర్వహించనున్న ఈ కార్యక్రమ పోస్టర్‌ను దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్. సుజాత తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోలమాంబ ఆలయ ఈవో కె. గాయత్రి, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి



జీవీఎంసీ గాంధీ పార్కులో నిరసన తెలుపుతున్న పౌర సంఘాల నేతలు

సీతమ్మధార : భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తూ ప్రజాస్వామ్యవాదులు, జర్నలిస్టులు, లాయర్ల మీద అక్రమంగా బనాయించిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పౌరసంఘాల నేతలు డిమాండ్ చేశారు. దాడులకు వ్యతిరేకంగా బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఉపా కింద అరెస్ట్ చేసిన వారందరినీ భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. న్యూస్ క్లిక్ కార్యాలయంపై, పాత్రికేయులపై ఢిల్లీ పోలీసులు చేసిన దాడిని ఖండించారు. ఈ కార్యక్రమంలో నేతలు పి.చంద్రశేఖర్, ఎం.లక్ష్మి, వెంకటలక్ష్మి, అనురాధ, లలిత, పద్మ, అన్నపూర్ణ, సలీం, వెంకట్రావ్, సూరప్పుడు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ

మద్దిలపాలెం: విశాఖ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గాత్ర కచేరీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీఎండీఏ ప్రతినిధులు డాక్టర్ వీఆర్‌కే రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ప్రముఖ గాయని వంకా శృతి రవళి పలు కీర్తనలు ఆలపించి అలరించారు.

సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

- విష్ణుకుమార్‌రాజుకు కె.కె.రాజు సవాల్
- సీఎం జగన్‌ను కించపరిస్తే ఊరుకోం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎవరికీ అందనంత స్థాయిలో ఉన్నారని, ఆయన్ను కించపరిస్తే చూస్తూ ఊరుకోమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు హెచ్చరించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మీడియా సమావేశంలో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ తనపై పోటీ చేయాలని, తానే గెలుస్తానని ప్రగల్భాలు పలకడంపై కె.కె.రాజు ఘాటుగా బదులిచ్చారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చకు సిద్ధమా.. అని విష్ణుకుమార్‌రాజుకు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రాష్ట్రాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడమే కాకుండా వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిరంతరం పరితపిస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుతో కుమ్మక్కైన కొంత మంది రాజకీయ నాయకులు సీఎంపై దుష్ప్రచారం చేస్తున్నారని, వారిలో ముఖ్యంగా విష్ణుకుమార్‌రాజు ఒకరని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయంలో బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా ఉంటూ చంద్రబాబు ద్వారా అనేక కాంట్రాక్ట్‌లు లబ్ధి పొందిన విష్ణుకుమార్‌రాజు.. తన స్థాయిని మరిచి సీఎం జగన్‌ను విమర్శించడమే కాకుండా ఆయన కుటుంబ సభ్యులపైన అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.

విశాఖలో చంద్రబాబుకు దత్తపుత్రుడు

రాష్ట్రంలో టీడీపీకి దత్తపుత్రుడిగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉంటే.. విశాఖలో చంద్రబాబుకు దత్తపుత్రుడిగా విష్ణుకుమార్‌రాజు వ్యవహరిస్తున్నారని కె.కె.రాజు విమర్శించారు. వాక్ స్వాతంత్ర్యం ఉంది కదాని.. నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మీరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు.. మా ప్రభుత్వం ఏర్పడిన తరువాత నాడు-నేడు ద్వారా స్కూళ్లు, పార్కులు, రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలు మొదలగు అభివృద్ధి పనులు ఎలా జరిగాయో.. ఒక్కసారి కళ్లతో చూడాలన్నారు. గత ఎన్నికల్లో మీరు ఓటర్లకు డబ్బును ఆశ చూపలేదా అని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఒక్కసారైనా ప్రశ్నించారా.. అప్పుడు కళ్లకు గంతలు కట్టుకున్నారా.. అని విమర్శించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, శశికళ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, కె.మురళీకృష్ణారెడ్డి, నీలి రవి, కె.సుశీల, వెంకటేష్, ఆళ్ల శ్రీనివాసరావు, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

మృతుడిది పార్వతీపురం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పార్వతీపురానికి చెందిన కొండెంశెట్టి వెంకటరమణ(63) తన పెద్ద కుమార్తె కొడుకు(మనవడు)కు రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిసి చూడటానికి బుధవారం ఉదయం 8.30 గంటల సమయంలో పార్వతీపురం నుంచి జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి కంచరపాలెం పరిధి రైల్వే న్యూకాలనీలో ఉంటున్న కుమార్తె ఇంటికి నడుచుకుని వెళ్తుండగా.. షిర్డీసాయిబాబా ఆలయం వద్దకు వచ్చేసరికి అదే మార్గంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న పల్సర్ బైకు అతడిని ఢీకొంది. దీంతో ఆ వృద్ధుడు కిందపడి స్పృహ కోల్పోయాడు. వెంటనే అతడిని కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 10.30 గంటలకు వెంకటరమణ మృతి చెందాడు. మృతుడి కుమార్తె జి.జ్యోతి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ సతీష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఎస్వీ జోగారావు



మాట్లాడుతున్న ఆచార్య వెలమల సిమ్మన్న

సీతంపేట: కవిగా, కథకుడిగా, నాటక రచయితగా, వ్యాసకర్తగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, సంపాదకుడిగా బహుముఖ ప్రజ్ఞతో ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంపాదించిన సాహితీ సంపన్నుడు ఆచార్య ఎస్వీ జోగారావు అని ఆచార్య వెలమల సిమ్మన్న కొనియాడారు. జోగారావు 92వ జయంతి సందర్భంగా సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో ఆయన సాహితీ ప్రసంగం చేశారు. జోగారావు చేసిన వచన కవిత్వం కమనీయంగా ఉంటుందని, సంప్రదాయ, ఆధునిక కవిత్వాల్లో అందెవేసిన చెయ్యని పేర్కొన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకరరావు మాట్లాడుతూ జోగారావు రాసిన యక్షగాన వాఙ్మయ చరిత్ర ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. దాస భారతీయ ప్రచురణ సంస్థ ఏర్పాటు చేసి తెలుగులో దాస సాహిత్యంపై ఎన్నో గ్రంథాలు ప్రచురించారన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో అధ్యాపకుడిగా ఎందరో సాహితీవేత్తలను తయారు చేసిన ఉత్తమ ఆచార్యుడు ఎస్వీ జోగారావు అని ప్రశంసించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.జి.వేణు, చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, కె.వి.ఎస్.మూర్తి, రామతాత, కుప్పిలి భీమేశ్వరరావు, నారాయణాచార్యులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

పబ్లిక్ డిమాండ్

ప్రమాదకరంగా డ్రైనేజీ పైకప్పులు



సత్యసాయినగర్‌లో శిథిలమైన డ్రైనేజీ పైకప్పు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయినగర్ కాలనీ కొండవాలు ప్రాంతంలో డ్రైనేజీలు, డ్రైనేజీ పైకప్పులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో డ్రైనేజీలపై గల పైకప్పు మీద కాలువేస్తే తిన్నగా కాలువలో పడాల్సిందే అన్నట్లుగా ఉంది పరిస్థితి. దీని మీదుగా అవతలి వైపు ఇళ్లకు చేరుకోవడం కష్టంగా ఉంది. దీనిని తాత్కాలికంగా మేమే చెక్కతో కవర్ చేసుకున్నాం. డ్రైనేజీలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలి.

– కె.రాజు, సత్యసాయినగర్ కాలనీ